గ్రూప్‌-2 మెటీరియల్‌ పంపిణీ

ఘంటసాల(అవనిగడ్డ): గ్రూప్‌–2 పోటీ పరీక్షలకు ప్రిపేర్‌ అవుతున్న పలువురు అభ్యర్థులకు ఏపీ సచివాలయ న్యాయ శాఖ జాయింట్‌ సెక్రటరీ వెలగపల్లి వెంకటేశ్వరరావు ఉచిత స్టడీ మెటీరియల్‌ అందించారు. ఘంటసాలలోని బుద్ధ విహార్‌ వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో బౌద్ధ గురువు ధమ్మ దజ బంతేజీ చేతుల మీదుగా మెటీరియల్‌ని అభ్యర్థులకు అందజేశారు.



పోర్టు నిర్మాణంపై హర్షాతిరేకాలు

పోర్టు పనులు తిలకించేందుకు తరలివచ్చిన ప్రజలు

మచిలీపట్నంటౌన్‌: బందరు పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతుండటంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. చురుకుగా జరుగుతున్న పోర్టు పనులను తిలకించేందుకు ఆదివారం ప్రజలు ఆ ప్రాంతానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోర్టు పనుల సందర్శనకు అనుమతులు ఇవ్వటంతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పరిశీలించారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన వారు ఆ ప్రాంతంలో ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు. నెలాఖరు వరకు ప్రతిరోజు ఉదయం 10 నుంచి 12 గంటల సమయంలో, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పోర్టు పనులను పరిశీలించేందుకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సూచనల మేరకు అవకాశం ఇచ్చారు. భావితరాలకు పోర్టు నిర్మాణం ఎంతో ఉపయోగమని హైదరాబాద్‌కు చెందిన ప్రశాంత్‌ తెలిపారు. ఇన్నాళ్లకు బందరు పోర్టు కల నెరవేరడం ఎంతో ఆనందంగా ఉందని బెంగళూరులో ఉద్యోగం చేసే లక్ష్మీ హారిక చెప్పారు.


పోర్టు పనులు పరిశీలిస్తున్న ప్రజలు

ప్రయాణికురాలి నగదు, నగలు మాయం

పెడన: బస్సులో ప్రయాణికురాలి వద్ద నగదు, నగలు ఉన్న బ్యాగు మాయం కావడంపై కేసు నమోదైంది. పెడన పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మచిలీపట్నం గాంధీనగర్‌కు చెందిన పులవర్తి ఉమాదేవి ఈ నెల 12వ తేదీ మచిలీపట్నం నుంచి శింగరాయపాలెం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. పెడన దాటిన తరువాత తన సంచి తెరిచి చూస్తే రూ.1.26 లక్షలు నగదు, సుమారు 18.2 కాసుల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో కంగారుపడ్డ ఆమె సంచిని పలుమార్లు వెతికినా కనిపించలేదు. ఇంటి వద్ద ఏమైనా మరిచిపోయాననే అనుమానంతోనే శింగరాయపాలెంలో బస్సు దిగి ఓ శుభకార్యానికి హాజరైంది. 13వ తేదీ సాయంత్రం మచిలీపట్నంలోని తన ఇంటికి వెళ్లి పరిశీలించగా నగదు, నగలు కూడా కనిపించలేదు. దీంతో వేర్వేరు చోట్ల ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న తన కుమారుడు విజయ్‌కు, భర్త సత్యనారాయణ (కానిస్టేబుల్‌)కు సమాచారం ఇచ్చి చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఫిర్యాదు విన్న అక్కడ సిబ్బంది పెడన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించడంతో ఆమె పెడన పీఎస్‌లో ఆదివారం ఫిర్యాదుచేశారు. తన పక్కన కూర్చున వారు పెడన బస్టాండులో 12వ తేదీ సాయంత్రం బస్సు దిగి వెళ్లిపోయారని, వారిపై అనుమానం ఉందని, వారిని చూస్తే మళ్లీ గుర్తుపడతానని ఫిర్యాదులో పేర్కొంది. పెడన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



బైక్‌ పైనుంచి పడి వ్యక్తి మృతి

నాగాయలంక: ఎదురుమొండి దీవిలో అడవి పందుల గుంపు అడ్డు వచ్చి బైక్‌పై నుంచి పడి గాయపడిన ఆరేవరపు వెంకటేశ్వరరావు (50) మరణించినట్లు ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం ఆదివారం రాత్రి తెలిపారు. గొల్లమంద గ్రామస్తుడు వెంకటేశ్వరరావు ఆదివారం ఉదయం 6 గంటలకు తన బైక్‌పై పొలానికి వెళ్తున్నాడు. ఇంటి నుంచి కొంత దూరం వెళ్లాక అడవి పందుల గుంపు రోడ్డుమీదకు వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో కింద పడి గాయపడ్డాడు. దెబ్బలతోనే ఇంటికి రావడంతో వెంటనే కుటుంబసభ్యులు గ్రామీణ వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన చనిపోయాడు. వెంకటేశ్వరరావు భార్య రాఘవమ్మ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఘటనపై కేసు నమోదు చేశారు.



భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం

నాగాయలంక: ధనుర్మాసోత్సవాల ముగింపులో భాగంగా శ్రీరామపాదక్షేత్రం సీతారామచంద్రుల ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిగింది. ముదునూరి శ్రీనివాసశాస్త్రి, ముదునూరి అచ్యుత శేఖరశర్మ బ్రహ్మత్వంలో ఉత్సవమూర్తులకు కల్యాణ పూజలు నిర్వహించారు.

- చల్లపల్లి: ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం స్థానిక గరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో గోదా కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైఖానస ఆగమ శాస్త్ర పండితులు బృందావనం ధన్వంతరాచారి నేతృత్వంలో వేదపండితులు గోదాదేవి-రంగనాథ స్వామి కల్యాణం జరిపించారు. అన్నసమారాధన నిర్వహించారు.
- బంటుమిల్లి: స్థానిక పద్మావతీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, సీతారామచంద్రస్వామి ఆలయాల్లో గోదాదేవి కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.





స్వచ్ఛ చల్లపల్లి దేశానికే ఆదర్శం

చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు దేశానికే ఆదర్శనీయులని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు అన్నారు. ఆదివారం స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం 3వేల రోజుల వేడుకలు స్థానిక సన్‌ఫ్లవర్‌ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చల్లపల్లి అభివృద్ధికి స్వచ్ఛ ఆంధ్ర మిషన్‌ సహకారం లభించేలా తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా డీఆర్కే దంపతులు గ్రామస్తులకు చేతిసంచులు పంపిణీ చేశారు. సర్పంచ్‌ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, స్వచ్ఛ చల్లపల్లి పెద్దలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

అవనిగడ్డ: సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక పోలీస్‌ స్టేషన్‌ పక్కన పోలీసులు, జర్నలిస్టులకు నిర్వహించి షటిల్‌ బ్యాడ్మింటన్‌ పోటీ విజేతలకు డీఎస్పీ పి. మురళీధర్‌ ఆదివారం బహుమతులు అందించారు. నాకౌట్‌ పద్ధతిన పోలీసుల నుంచి నాలుగు, జర్నలిస్టుల నుంచి నాలుగు టీంలు పోటీ పడ్డాయి. ఫైనల్‌లో పోలీసుల నుంచి హేమంత్‌, నాగబాబు, జర్నలిస్టుల నుంచి యర్రంశెట్టి సుబ్బారావు, తేజ పోటీ పడ్డారు. హేమంత్‌, నాగబాబు విన్నర్‌గా, సుబ్బారావు, తేజ రన్నర్‌గా నిలిచారు. విజేతలకు డీఎస్పీ మురళీధర్‌ ట్రోఫీతో పాటు బహుమతులు అందించారు. సీఐ ఎల్‌. రమేష్‌, ఎస్‌ఐ జి. రమేష్‌, జర్నలిస్టులు పాల్గొన్నారు.

నగరాన్ని కప్పేసిన మంచుదుప్పటి

మచిలీపట్నంటౌన్‌: నగరాన్ని ఆదివారం మంచు దుప్పటి కప్పింది. తెల్లవారుజాము నుంచి నగరంలో మంచు పెద్ద ఎత్తున కురిసింది. భోగి పండుగ కావడంతో తెల్లవారుజామునే భోగిమంటలు వేసేందుకు లేచిన నగర ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9.30 గంటల వరకు మంచు తొలగకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. చలికాలం ప్రారంభమైన తరువాత ఆదివారం పెద్దఎత్తున మంచు కురిసింది.




























సాక్షి క్లాసిఫైడ్స్











ఆనందోత్సాహాలతో భోగి


రేమాలవారిపాలెంలో ముగ్గుల పోటీ


గాంధీనగరంలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న పెద్దలు


బందరు నగరంలో భోగి మంటలు


కోడూరులోని ఓ నివాస గృహంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

మచిలీపట్నంటౌన్/పెడన/అవనిగడ్డ: భోగి వేడుకలను మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలు ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.తెల్లవారుజామున పనికిరాని వస్తువులు, కర్రలతో ఇళ్ల ముందు, ప్రధాన కూడళ్ల వద్ద భోగి మంటలు వేసి సందడి చేశారు. భోగిమంటల్లో నీళ్లు కాచుకుని స్నానాలు ఆచరించారు. గృహాల ముందు సంక్రాంతి ముగ్గులు వేసి రంగులు, గొబ్బెమ్మలతో అలంకరించారు. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. బందరులో ఎమ్మెల్యే పేర్ని నాని ఇంటివద్ద భోగి మంట వేశారు. పేర్ని నాని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సంప్రదాయంగా కోడి పందేలు, ముగ్గుల పోటీలు జరిగాయి. పిల్లలు, పెద్దలు గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు.


బందరు ఎమ్మెల్యే పేర్ని నాని ఇంటి వద్ద భోగి మంట


పాశ్చాపురంలో భోగి మంట


నాగాయలంకలో భోగిమంట చుట్టూ ప్రదక్షిణ

19 నుంచి వనవలమ్మ జాతర

మచిలీపట్నంటౌన్: స్థానిక నిజాంపేటలోని నూతి వీరయ్య ఆదివనవలమ్మ దేవి 107వ వార్షిక గ్రామోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి జరుగుతాయని నిర్వాహకులు నూతి వనవెంకట సత్యనారాయణ (రమణ) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఉదయం 8.15 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, ఆలయంలో 101 దేవతల నామాలతో పూజా కార్యక్రమం, 20న అమ్మవారికి పసుపు, కుంకుమ ఉత్సవం, 21న జాతర మహోత్సవం, 22న అమ్మవారికి వెండిచీరను అలంకరించిన అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 18వ తేదీన నెల సంబరం నిర్వహిస్తామని వివరించారు.

నూతన వస్త్రాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని 3వ డివిజన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆదివారం నూతన వస్త్రాలను అందజేశారు. డెప్యూటీ మేయర్ శీలం భారతి ఏర్పాటు చేసిన వీటిని పేర్ని నాని చేతుల మీదుగా అందజేశారు. మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

పెడన: పెడన భట్ల జ్ఞాన కోటయ్య జెడ్పీహెచ్ఎస్ 1989–90 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకుని భావోద్వేగానికి గురయ్యారు. క్షేమ సమాచారం తెలుసుకుని తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు.

33 ఏళ్లకు మళ్లీ..

కృత్తివెన్ను: సంగమూడి ఉన్నత పాఠశాల 1991–92 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో కలుసుకున్నారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

ప్రార్థనా మందిర నిర్మాణానికి ఆర్థిక సాయం

బోడగుంట(మోపిదేవి): బోడగుంట దళితవాడలో నిర్మిస్తున్న బాపిస్టు చర్చి నిర్మాణానికి అవనిగడ్డకు చెందిన శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ వరుణ్, సంఘ సభ్యులు కొక్కిలిగడ్డ రమేష్‌బాబు, కొమ్ము ఇస్సాక్ పాల్గొన్నారు.

10 మంది జూదరుల అరెస్ట్

మోపిదేవి: మోపిదేవి ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ శనివారం రాత్రి మండల పరిధిలోని కొక్కిలిగడ్డ గ్రామంలో బహిరంగ ప్రదేశంలో జూదం ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 6,470 స్వాధీనం చేసుకున్నారు.

క్యాంటీన్‌లోకి దూసుకెళ్లిన కారు

గూడూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి క్యాంటీన్‌లోకి దూసుకు వెళ్లింది. విజయవాడ నుంచి మచిలీపట్నం మండలం గుండుపాలెం వెళ్తున్న కారు ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో అదుపుతప్పి క్యాంటీన్‌లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో క్యాంటీన్‌లో సరుకు వేస్తున్న పుప్పాల బంగారు నాంచారయ్య కాలికి గాయాలయ్యాయి. బాధితుడిని బందరు ఆస్పత్రికి తరలించారు.

సీఎం జగన్‌ను కలిసిన పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: భోగి పండుగ సందర్భంగా తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి వేడుకల్లో సీఎం జగన్‌తో పాటు పేర్ని కిట్టు పాల్గొన్నారు.


సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పేర్ని కిట్టు